బహుమతి పొందిన చిట్టికథ

# కసి

— బొడ్డంపాటి కృష్ణవేణి




"చాలా కష్టాలలో వున్నాను పిన్నీ" అనడం మా రామ్మూర్తికి అలవాటయిపోయింది. అయితే ఏనాడూ రామ్మూర్తి నన్ను చిల్లిగవ్వ అడగలేదు.

పదిహేనువందల రూపాయలు వచ్చే ఉద్యోగంవున్న రామ్మూర్తి రెండుగదుల యింట్లో వుంటున్నాడు. రామ్మూర్తికి ఇంకా పెళ్ళికాలేదు. పెళ్ళి చేసుకునే ఆలోచనా వున్నట్లు నాకు అనిపించలేదు. అతని జీవితం నుంచి మరెవరయినా నేర్చుకోవలసిన 'పాఠం' ఒకటి వుంది. అది డబ్బు ఎలా ఖర్చుపెట్టకుండా వుండాలన్నదే! దేశానికి ఆర్థికమంత్రి పదవి రామ్మూర్తికి యిస్తే ప్రభుత్వ ఖజానామటుకు ఎప్పుడూ ఖాళీ అవదని కచ్చితంగా చెప్పగలను.

అసలు తను ఎప్పుడూ "చాలా కష్టాలలో వున్నాను పిన్నీ" అని ఎందుకు అంటూవుంటాడో తెలుసుకోవాలని చాలాసార్లు నాకు అనిపించినా ఊరుకున్నాను. నేను రామ్మూర్తికి దూరపుబంధువుని. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న రామ్మూర్తికి నేనంటే ఎంతో గౌరవం. అష్టకష్టాలుపడి కటికదరిద్రం అనుభవించిన రామ్మూర్తి చదువుమటుకు నిర్లక్ష్యం చెయ్యలేదు. బి.ఏ. పాసయి ఉద్యోగంలో చేరాడు. పాతిక సంవత్సరాలు నిండకుండానే ఉద్యోగంలో చేరిన రామ్మూర్తి పదిహేనువందలతో హాయిగా బ్రతకవచ్చు. కాని అలా వున్నాడా అంటే అదీలేదు. పెళ్ళి చేసుకున్నాడా అంటే అదీలేదు. అందుకే ఒక రోజున అడగకుండా వుండలేకపోయాను.

"రామ్మూర్తీ... నువ్వు నేను చెప్పినమాట వింటావని నాకు నమ్మకం వుంది. పెళ్ళి చేసుకోకూడదా? సరే అంటే మంచి అమ్మాయిని నేనే చూస్తాను" అన్నాను రెండు ఇళ్ళ అవతలవున్న మా ఇంటికి రామ్మూర్తి ఒకరోజు రాగా.

"వద్దు పిన్నీ, డబ్బు సరిపోదు" అన్నాడు రామ్మూర్తి.

"నీకు కష్టాలు ఏమిటి? వుంటే అన్నీ తెచ్చిపెట్టుకున్న కష్టాలే. ఎందుకు వండుకుని తినడం? పెళ్ళి చేసుకుని హాయిగా వుండవచ్చు. పెళ్ళాన్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటావని నాకు తెలుసు" అన్నాను.

రామ్మూర్తికి నా మాటలు ఏమాత్రమూ నచ్చలేదు. చిన్నగా నవ్వాడు. అంతే.

అయితే ఈమాటు నేను ఊరుకోలేదు. జేబులో కాళ్ళు పెట్టుకున్న రామ్మూర్తిని కూర్చోబెట్టి అడిగాను. చెప్పక తప్పదన్నాను.

"డబ్బు ఏంచేస్తావు?" అని అడిగాను.

రామ్మూర్తి చెప్పక తప్పించుకుందామనుకున్నాడు. కాని కుదరలేదు. చెప్పడం మొదలుపెట్టాడు. "పిన్నీ చిన్నప్పుడు మా నాన్న నాకు ఎర్రని ఏగానీ ఇచ్చేవాడు కాదు. ఫ్రెండ్స్ ఆకలివేస్తే హోటల్‌కి వెళ్ళి తినేవాళ్ళు. నా జేబులు, కడుపు ఎప్పుడూ ఖాళీయే. ఇక సినిమాలకి వెళ్ళడం కలలోని వార్త. అప్పటినుంచే నాకు డబ్బుమీద పిచ్చి వ్యామోహం పెరిగింది. లక్షలు కాకపోయినా ఒక లక్ష అయినా కూడబెట్టి బ్యాంకులో వేసి చూసుకుని ఆ ఆనందంతో చావాలని కోరికని పెంచుకున్నాను" అన్నాడు రామ్మూర్తి సీరియస్‌గా. ఒక్క నిమిషం ఆగి—

"నేను ఉద్యోగంలో చేరిన కొద్ది నెలలకే ఒక ఆరువేలు కష్టపడి కూడబెట్టి ఫిక్సిడ్ డిపాజిట్‌లో వేసుకున్నాను. అలా అప్పటినుంచే ఖర్చులు బాగా తగ్గించుకుంటూ, కనీస అవసరాలను మరీ కనీసం చేసుకుంటూ డబ్బు కూడబెట్టుకుంటూ ఫిక్సిడ్ డిపాజిట్లలో వేస్తున్నాను" చెప్పాడు రామ్మూర్తి.

"మరి వచ్చిన వడ్డీ" అడిగాను.

"అదీ, జీతంలోంచి తీసి బ్యాంకులో వేస్తున్నదీ చేరి ఏ మూడువేలో అయ్యేసరికి ఆ మొత్తాన్ని తిరిగి ఫిక్సిడ్ డిపాజిట్‌లో వేస్తున్నాను. నాకు తల్లి ప్రేమ తెలీదు. తండ్రి హీనంగా చూసాడు. నాకు ఎవరూ లేరు. డబ్బును చూస్తే నాకు పిచ్చి, ప్రేమ, వ్యామోహం. అందుకే నా పేర ఎలాగయినా లక్ష వుండాలి పిన్నీ" అని పూర్తి చేశాడు రామ్మూర్తి.

సుఖంగా బ్రతకడానికే డబ్బు అనుకునే నాకు ఒక 'విపరీత సిద్ధాంతాన్ని' రామ్మూర్తి బోధించాడు. అది డబ్బు దాచుకుని 'అర్థం'తో 'అర్థం' లేని కసి తీర్చుకోవడం! రామ్మూర్తి వంటి వాళ్ళు వుంటారా అని ఎవరికైనా సందేహం రావచ్చు. కాని నా కన్నుల ముందరే రామ్మూర్తి వున్నాడు. డబ్బు వుండీ దారిద్ర్యం అనుభవిస్తున్నాడు. రామ్మూర్తిది తీరని దారిద్ర్యం! □